మరొక మగువ సగంచినిగిన రవిక నొకటి తొడిగింది. ఇంకొక దయార్ద్ర హృదయిని కాకి గూటిని సరిచేయడానికి స్వయంగా పూనుకొనింది. ఇంత మంది యిన్ని చేస్తుంటే ఆ పిచ్చిది కదిలీ మెదలకుండా కూర్చుంది బొమ్మలా. 'ఫరవాలేదు. పిచ్చిదానికి కూడా మానభంగానికి మాన సంరక్షణకు తేడా తెలిసినట్లుందే!' అనుకొన్నాను.

ఆ సంఘటన జరిగిన నాటినుండి మా యిరుగు పొరుగు హృదయాల్లో పిచ్చిది చోటుచేసుకొనింది. ఇప్పుడది సాధారణంగా వివస్త్రగా కనుపించడమేలేదని చెప్పాలి.

అయితే డాక్టరుగారికి మాత్రం ఎనలేని కోపం!

మురుగు కాలువల్ని సరిగా శుభ్రం చేయలేని మునిసిపాలిటీ వారిమీద కాదు. మురుగు కాలువలో పారుతున్న నీటికి అంతరాయంగా కుళ్ళిన పండ్లను కుమ్మరిస్తున్న పండ్ల వ్యాపారస్థులమీద కాదు. ముక్కులు పగిలేటట్లు దుర్గంధాన్ని వెదచల్లుతున్న మురుగు కాలువలమీద అసలేకాదు. మరెవరిమీద అంటే—ఆ పిచ్చిదానిమీద!

"చూడండి. అసలు యిలాంటి మనుష్యులు బ్రతకడం దండగేకాదు. అపాయకరంకూడా. దానికేం? కుళ్ళిన పండ్లు తింటుంది. మురిగిన నీళ్ళు తాగుతుంది. ఉత్తరోత్తర దానికి సంక్రమించే రోగాలకు సంఘం బలి అవుతుంది!" ఒకనాడు డాక్టర్ నాతో అన్నాడు.

"డాక్టరుగారూ! మనం ఎన్నో ఆరోగ్యసూత్రాలను పాటిస్తున్నామని అనుకొంటున్నాం. కానీ ఏదో ఒక రోగం వద్దంటే వస్తూనే ఉంది. మరి ఆ పిచ్చిది మురుగుడు నీళ్ళు తాగుతూ కుళ్ళిన పుచ్చిన పండ్లు తింటూ దుక్కలా వుంది గదండీ?" సందేహంగా ప్రశ్నించాను.

"దాని శరీరతత్త్వం సర్దుకుపోగలిగింది కాబట్టి యిప్పుడు దుక్కలాగే కనిపిస్తుంది. ఆ తత్త్వం మారినపుడు అంటే దాని ఒంట్లో రోగనిరోధకశక్తి తగ్గినపుడు అది అంటు వ్యాధులకు నిలయమవుతుంది. అపుడు

